భాగ్యనగరం.. మజ్లిస్‌కే పట్టం

- సంబరాల్లో ఎంఐఎం శ్రేణులు.. నిరాశలో బీజేపీ నేతలు
- కనిపించని బీజేపీ అభ్యర్థి మాధవీలత
- డిపాజిట్లు కోల్పోయిన కాంగ్రెస్, బీఆర్ఎస్

చార్మినార్: హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి వరుసగా ఐదోసారి కూడా మజ్లిస్ పార్టీ అధినేత, సిట్టింగ్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఘన విజయం సాధించారు. హైదరాబాద్‌లో ఈసారి ఫలితాలు తారుమారవుతాయని భావించిన బీజేపీ నాయకులు, కార్యకర్తలకు మంగళవారం వెలువడిన ఫలితాలు నిరాశను కలిగించాయి. ఇక ముందుగానే ఊహించినట్లు ఘన విజయం సాధించిన మజ్లిస్ పార్టీ అధినేతకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. దారుస్సలాంలో మజ్లిస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకొన్నారు. పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ వెలువడినప్పటి నుంచి అందరి చూపు హైదరాబాద్ వైపు మళ్లింది. ముఖ్యంగా బీజేపీ అభ్యర్థి మాధవీలత ఎన్నికల ప్రచారంలో జోరు పెంచి తనే గెలుస్తున్నానంటూ..ఓటర్లలో భ్రమ కలిగించారు. దీంతో ఎవరు విజయం సాధిస్తారనే ఉత్కంఠ ఓటర్లలో కలిగింది. అయితే మజ్లిస్ పార్టీకి కంచుకోటగా ఉన్న హైదరాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి ఐదోసారి కూడా అసదుద్దీన్ ఒవైసీ విజయం సాధించి సస్పెన్స్‌కు తెరదించారు. హైదరాబాద్‌లో తమను ఢీకొనే సత్తా ఎవరికి లేదని మరోసారి నిరూపించారు. హైదరాబాద్‌లో మజ్లిస్ పార్టీకి గట్టిగా బలమున్నప్పటికీ..బీజేపీ అభ్యర్థి మాధవీలత ఎన్నికల ప్రచారాన్ని జోరుగా నిర్వహించి గెలుస్తానని ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఆమె ఆశలు అడియాశలయ్యాయి. హైదరాబాద్ ఓటర్లు మజ్లిస్ వైపే మొగ్గు చూపారు. అయితే గతంలో కన్నా..ఈసారి జరిగిన ఎన్నికల్లో అసదుద్దీన్ ఒవైసీని ఉక్కిరిబిక్కిరి చేసిన మాట వాస్తవం. ఇక కాంగ్రెస్ పార్టీ అభ్యర్థితో పాటు బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు తమ ఉనికిని కాపాడుకోలేకపోయారు. వీరిద్దరు రెండో స్థానంలో నలిచిన బీజేపీ అభ్యర్థికి దరి దాపుల్లో కూడా నిలవ లేకపోయారు. డిపాజిట్లు సైతం కోల్పోయారు.

790 ఓట్లకే పరిమితమైన బీఆర్ఎస్ అభ్యర్థి..

చార్మినార్ శాసన సభ నియోజకవర్గంలో 111762 ఓట్లు పోలవ్వగా.. ఇందులో మజ్లిస్ పార్టీ సిట్టింగ్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీకి 70,799, బీజేపీ అభ్యర్థి మాధవీలతకు 34,112 ఓట్లు రాగా.. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మహ్మద్ వలి ఉల్లా సమీర్‌కు 5117 ఓట్లు, బీఆర్ఎస్ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్‌కు కేవలం 790 ఓట్లు మాత్రమే వచ్చాయి. చార్మినార్ శాసన సభ నియోజకవర్గంలో మొత్తం 111762 ఓట్లు పోలవ్వగా.. ఇందులో గడ్డం శ్రీనివాస్ యాదవ్ కేవలం 790 ఓట్లు సాధించడంపై పాతబస్తీ సీనియర్ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మండిపడుతున్నారు.

కార్వాన్‌లో పట్టు సాధించిన మజ్లిస్..

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలో మజ్లిస్ తనకు తిరుగులేదన్న విషయం మరోసారి నిరూపించుకుంది. కార్వాన్ నియోజకవర్గంలో వరుసగా గెలుస్తూ వస్తున్న మజ్లిస్ పార్లమెంట్ ఎన్నికల్లో కూడా ఇక్కడ నుంచి సుమారు 50 వేల మెజార్టీ సాధించింది. కార్వాన్ నియోజకవర్గంలో ఒక జియాగూడ డివిజన్ తప్పితే మిగతా అన్ని డివిజన్లలో మజ్లిస్ అభ్యర్థులే కార్పొరేటర్లుగా ఉన్నారు. కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ ఆధ్వర్యంలో నియోజకవర్గం మజ్లిస్‌కు కంచుకోటగా మారింది. మొత్తం 183506 ఓట్లు పోల్ కాగా అందులో 108509 ఓట్లు మజ్లిస్ అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీకి పడ్డాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో కార్వాన్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ సాధించిన మెజార్టీ కంటే ఇది ఎక్కువ. మొత్తం ఎన్నికల ప్రక్రియలో రెండు రౌండ్లలో మాత్రమే బీజేపీ అభ్యర్థి మాధవీలత ఆధిక్యం చాటుకున్నారు. అయితే చిట్టచివరకు ఆమె 59722 ఓట్లు మాత్రమే పొందగలిగారు. కాంగ్రెస్ అభ్యర్థి 11,604 ఓట్లు పొందారు. పదేళ్ల రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ అభ్యర్థి కేవలం 3671 ఓట్లతోనే సరిపెట్టుకున్నారు. 48,787 ఓట్ల ఆధిక్యం పొంది మజ్లిస్ కార్వాన్‌లో మరోసారి తన ఆధిక్యాన్ని నిలుపుకుంది.



సంబరాల్లో మజ్లిస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు

గోషామహల్‌లో బీజేపీ అభ్యర్థికి భారీ మెజార్టీ..

సుల్తాన్‌బజార్: ఎంఐఎం అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీ బీజేపీ అభ్యర్థి మాధవీలతకు హోరాహోరి పోటీ జరిగింది. గోషామహల్ నియోజకవర్గంలో బీజేపీ ఎంఐఎంపై 17 రౌండ్లు పూర్తి అయ్యే సరికి 61,518 ఓట్ల మెజార్టీతో ముందుంది. అన్ని రౌండ్లలో మాధవీలత క్రమం క్రమంగా మెజార్టీ సాధించారు. కేవలం 16వ రౌండ్లలో దత్తాత్రేయ డివిజన్‌లో మాత్రం మెజార్టీ తగ్గింది. గత ఎమ్మెల్యే ఎలక్షన్‌లో రాజాసింగ్ సాధించిన ఓట్లకంటే మాధవీలత అధిక ఓట్లను సాధించి ఎమ్మెల్యే రాజాసింగ్ రికార్డు బ్రేక్ చేసిందని చెప్పవచ్చు. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్ రెండవ స్థానంలో ఉండగా 3వ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి పరిమితమయ్యాడు. ఎట్టకేలకు హైదరాబాద్ పార్లమెంట్ స్థానాన్ని అసదుద్దీన్ ఒవైసీ దక్కించుకోగా గోషామహల్ నియోజకవర్గంలో మాత్రం మాధవీలత మంచి మెజార్టీని సాధించడం చర్చనీయాంశంగా మారింది.

నాంపల్లిలో కాంగ్రెస్, బీజేపీ మధ్యనే పోటీ..

నాంపల్లి: సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని నాంపల్లి సెగ్మెంట్‌లో కాంగ్రెస్, బీజేపీ మధ్యనే ప్రధానంగా పోటీ జరిగింది. మాసాబ్‌ట్యాంక్‌లోని జేఎన్ఎఫ్ఏయూ ఫైన్ ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో మంగళవారం కౌంటింగ్ చేపట్టారు. ఇక్కడ 20 రౌండ్లకూ 14 టేబుళ్ల ఏర్పాటు చేశారు. 17 రౌండ్లలో కాంగ్రెస్ పార్టీకి మెజార్టీ రాగా బీజేపీకి కేవలం మూడు రౌండ్లలోనే ఆధిక్యత కనబరిచింది. 8, 12, 18 రౌండ్లలో మాత్రమే బీజేపీకి మెజార్టీ ఓట్లు వచ్చాయి. ఏడో రౌండ్‌లో బీజేపీకి అత్యల్పంగా 182 ఓట్లు రాగా, కాంగ్రెస్‌కు అత్యధికంగా 8199 ఓట్లు వచ్చాయి. బీజేపీకి 8వ రౌండ్‌లో 4661 ఓట్లు అత్యధికంగా రాగా కాంగ్రెస్‌కు అత్యల్పంగా 18వ రౌండ్‌లో 3008 ఓట్లు పడ్డాయి. ఇక బీఆర్ఎస్‌కు ఒక్క రౌండ్‌లో కూడా వెయ్యికి పైబడి ఓట్లు రాలేదు. 20వ రౌండ్‌లో బీఆర్ఎస్‌కు అత్యల్పంగా 131 ఓట్లు రాగా 18వ రౌండ్‌లో 604 ఓట్లు వచ్చాయి. ఇక్కడ ఎంఐఎం పార్టీ అభ్యర్థిని బరిలోకి దింపకపోవడంతో ముస్లిం మైనార్టీ ఓట్లన్నీ కాంగ్రెస్ పార్టీకి పడ్డాయి. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి 103155 ఓట్లు రాగా, బీజేపీ అభ్యర్థి, సిట్టింగ్ ఎంపీ కిషన్‌రెడ్డికి 40423, బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావు గౌడ్‌కు 5554, బీఎస్పీ పార్టీ అభ్యర్థి దండెపు బస్వానందంకు 262, నోటాకు 358 ఓట్లు వచ్చాయి. మొత్తం 45 మంది అభ్యర్థులు బరిలో ఉండగా వీరిలో 27 మంది స్వతంత్రులు, మరో 14 మంది రిజిస్టర్డ్ పార్టీలకు చెందిన అభ్యర్థులు పోటీ చేసినా ఏ ఒక్కరికి నోటాకు మించి ఓట్లు రాలేదు.

చాంద్రాయణగుట్టలో మజ్లిస్‌కు 98,855 ఓట్ల మెజార్టీ..

చాంద్రాయణగుట్ట: మజ్లిస్ కంచుకోటగా ఉన్న చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలో మరోసారి ఆ పార్టీకి భారీగా ఓట్లు నమోదయ్యాయి. నిజాం కాలేజీ లైబ్రరీ హాల్‌లో మంగళవారం నిర్వహించిన ఓట్ల లెక్కింపులో మొదటి రౌండ్ నుంచే మజ్లిస్ పార్టీ ఆధిక్యతను కనబరిచింది. మొత్తం 22 రౌండ్లకు గాను మజ్లిస్ లీడింగ్‌లో ఉండగా.. తర్వాతి స్థానాల కోసం బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు పోటీ పడాల్సి వచ్చింది. మొదటి రౌండ్‌లో ఎంఐఎంకు 6784 ఓట్లు రాగా..బీజేపీకి-235, కాంగ్రెస్‌కు 291, బీఆర్ఎస్‌కు 19 ఓట్లు పోలయ్యాయి. నాలుగో రౌండ్‌లో మాత్రం ఎంఐఎంకు 2333 ఓట్లు, బీజేపీ-4843, కాంగ్రెస్‌కు 509, బీఆర్ఎస్‌కు 242 ఓట్లు పోలయ్యాయి. మొత్తం మీద కేవలం నాలుగు రౌండ్లలో మాత్రమే బీజేపీ ఆధిక్యాన్ని కనబరిచింది. ఈ నియోజకవర్గంలో మొత్తం 1,71,824 ఓట్లు పోలవ్వగా, అందులో మజ్లిస్‌కు 1,28,103 ఓట్లు రాగా..బీజేపీకి 29,248, కాంగ్రెస్‌కు 10,162, బీఆర్ఎస్‌కు 2254 ఓట్లు వచ్చాయి. మొత్తం మీద మజ్లిస్ పార్టీ బీజేపీపై 98,855 ఓట్ల ఆధిక్యతను సాధించింది.

యాకుత్‌పురాలో 68,687 మజ్లిస్‌కు ఓట్ల మెజార్టీ..

గౌలిపురా: యాకుత్‌పురా నియోజకవర్గంలోనూ మజ్లిస్ పార్టీ తన హవాను కొనసాగించింది. మొత్తం 24 రౌండ్లకు గాను ఏడు రౌండ్లలో బీజేపీ ఆధిక్యతను కనబరచగా, మిగిలిన అన్ని రౌండ్లలోనే మజ్లిస్ పార్టీనే ముందంజలో నిలిచింది. నియోజకవర్గంలో 1,56, 341 ఓట్లు పోలవ్వగా, అందులో ఎంఐఎంకు 1,06,122 ఓట్లు, బీజేపీకి 37,435, కాంగ్రెస్‌కు 7634, బీఆర్ఎస్‌కు 2918 ఓట్లు నమోదయ్యాయి. ఎంఐఎం పార్టీకి 68,687 ఓట్ల ఆధిక్యం లభించింది. ఈ నియోజకవర్గంలో భారీగా ఓట్లు దక్కుతాయని బీజేపీ భావించినప్పటికీ ఫలితాలను చూసి నిరాశ పడాల్సిన పరిస్థితి నెలకొంది.

ప్రజలు మజ్లిస్ వైపే: ఎమ్మెల్యే కౌసర్



ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ ఆధ్వర్యంలో సంబరాలు

గోల్కొండ: ప్రజల కోసం పోరాడి వారి హక్కుల సాధనకు కృషి చేస్తున్న మజ్లిస్ పార్టీకి హైదరాబాద్‌లో తిరుగులేదన్న విషయం మరోసారి నిరూపితమైందని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. హైదరాబాద్ లోక్‌సభ స్థానం నుంచి మజ్లిస్ అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీ తిరుగులేని మెజార్టీతో విజయం సాధించిన సందర్భంగా మంగళవారం ఆయన ఆధ్వర్యంలో విజయ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో ఈ సారి మజ్లిస్‌ను ఓడించేందుకు ప్రత్యర్థులు సర్వశక్తులు వడ్డారని అయితే మజ్లిస్‌కు ఉన్న ప్రజాభిమానం ముందు ఆ కుట్రలు ఫలించలేదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మహ్మద్‌నసీరుద్దీన్, నాయకులు హారూన్‌ఫరాన్, వజీఉజ్‌జమా, షకీర్ ఆలీఖాన్, అబీబ్‌చాస్, ఏ.కే.పటాన్, ఎక్బాల్ సేట్ తదితరులున్నారు.

అసదుద్దీన్ ఒవైసీకి శుభాకాంక్షలు



అసదుద్దీన్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న రాజేశ్వర్‌రావు, ఆర్.దీపేష్ రాజ్ వర్మ

చార్మినార్: హైదరాబాద్ లోక్‌సభ స్థానం నుంచి సిట్టింగ్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఘన విజయం సాధించడంతో మజ్లిస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు మంగళవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు సంబరాలు జరుపుకొన్నారు. దారుస్సలాంలో బాజా భజంత్రీల నడుమ నత్యాలు చేశారు. మజ్లిస్ పార్టీ నాయకులు రాజేశ్వర్ రావు, ఆర్.దీపేష్ రాజ్ వర్మ తదితరులు అసదుద్దీన్ ఒవైసీకి పూల బొకే అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

కిషన్‌రెడ్డికి అభినందనలు



కిషన్‌రెడ్డికి అభినందనలు తెలిపిన బజ్జుగోప్ యాదవ్

అబిడ్స్: మరోసారి సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ ఎంపీగా విజయం సాధించిన కిషన్‌రెడ్డికి గోషామహల్ ప్రాంతానికి చెందిన బజ్జుగోప్ యాదవ్ అభినందనలు తెలిపారు. మంగళవారం కిషన్‌రెడ్డిని ఆయన కలిసి సత్కారం చేశారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ..సికింద్రాబాద్ పార్లమెంట్‌ను అన్నిరంగాల్లో అభివృద్ధికి మరింత కృషి చేస్తానన్నారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం



చెత్తాచెదారాన్ని తొలగిస్తున్న ఇన్‌స్పెక్టర్ బాలస్వామి

గౌలిపురా: మంగళవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి గౌలిపురా డివిజన్‌లోని లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాయి. దీంతో వర్షపు నీరు ఎక్కడక్కడ నిలిచిపోయాయి. అదే విధంగా బీబీ బజార్ చౌరస్తా, ప్రధాన రోడ్డులో మ్యాన్‌హోల్ పూర్తిగా చెత్తాచెదారంతో నిండిపోయి బ్లాక్ అయ్యింది. దీంతో ఈ ప్రాంతంలో పెద్ద ఎత్తున ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఈ విషయాన్ని గుర్తించిన భవానీనగర్ ఇన్‌స్పెక్టర్ ఎ.బాలస్వామి ఆధ్వర్యంలో పోలీసులు వర్షపు నీరు సజావుగా వెళ్లేందుకు చర్యలు తీసుకున్నారు. దీంతో వర్షాపు నీరు సజావుగా వెళ్లిన అనంతరం ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలి

గోల్కొండ: వేసవి సెలవులను పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని నాంపల్లి ఎమ్మెల్యే మహ్మద్ మాజీద్‌హుస్సేన్ అన్నారు. వేసవి సెలవుల్లో మెహిదీపట్నం చోటీ మసీదులో మసీదు నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో పిల్లలకు సమ్మర్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఖురాన్ గ్రంథ పఠనంతో పాటు వివిధ విషయాలపై విద్యార్థులకు స్పెషల్ క్యాంప్ నిర్వహించారు. మంగళవారం క్యాంప్ ముగింపు సందర్భంగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన సమ్మర్ క్యాంప్‌లో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక కార్యక్రమాల ద్వారా పిల్లలో దైవభక్తి పెరుగుతుందన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండడంతో పాటు పిల్లలు తమ కుటుంబం, సమాజం పట్ల తమ బాధ్యతలను తెలుసుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో మజీదు నిర్వహణ కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నవజాత శిశువు మృతి.. కేసు నమోదు



జంగమ్మెట్ ఆసుపత్రి ఎదుట నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

చాంద్రాయణగుట్ట: వైద్యుల నిర్లక్ష్యం కారణంగా అప్పుడే పుట్టిన శిశువు మృతి చెందిన ఘటన ఫలక్‌నుమా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. జంగమ్మెట్ రవీంద్రనాయక్ నగర్ కాలనీకి చెందిన రాజు కుమార్తె పింకి (21)కు మొదటి గర్భం కావడంతో ప్రసవం కోసం పక్కనే ఉన్న జంగమ్మెట్ ప్రసూతీ ఆసుపత్రిలో సోమవారం ఉదయం చేర్పించారు. రాత్రి 8 గంటలకు ప్రసవం చేసిన వైద్యులు చాలా సేపటి వరకు శిశువుకు సంబంధించిన సమాచారం కుటుంబ సభ్యులకు వెల్లడించలేదు. సాధారణ ప్రసవంతో జన్మించిన మగ శిశువు ఆరోగ్యం బాగాలేదంటూ చివరకు ఆగ మేఘాల మీద నిలోఫర్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే శిశువు మృతి చెందినట్లు అక్కడి వెల్లడించారు. వైద్యులు కాకుండా కింది స్థాయి నర్సులు ప్రసవం చేయడంతోనే ఈ ఘటన చోటు చేసుకుందని సీపీఎం నాయకులు ఆసుపత్రి ఎదుట మంగళవారం ఉదయం నిరసన చేపట్టారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

గాజుల అంజయ్యకు సన్మానం



గాజుల అంజయ్యను సన్మానిస్తున్న రాకేష్ తివారీ తదితరులు

చార్మినార్: ఈసారి ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాలు జూలై 7న గోల్కొండ అమ్మవారి బోనాలతో ప్రారంభమవుతాయని భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య తెలిపారు. మంగళవారం సాయంత్రం ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీకి నూతన చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎంపికైన గాజుల అంజయ్యను పలు దేవాలయాల కమిటీ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సప్త మాతృకలకు సప్త బంగారు బోనం కార్యక్రమంలో భాగంగా ఏడు అమ్మవారి ఆలయాలకు బంగారు పాత్రలో బోనంతో పాటు పట్టు వస్త్రాలను సమర్పించనున్నా మన్నారు. ఈ సారి బంగారు బోనం పూజా కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ మాజీ చైర్మన్ రాకేష్ తివారితో పాటు టీపీసీపీ కార్యదర్శి కె.ఎస్.ఆనంద్‌రావు, ప్రతినిధులు మధుసూదన్ యాదవ్, హన్స్‌రాజ్, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ సైకిల్ దినోత్సవం



ఎజైకిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన సైకిల్ దినోత్సవ ర్యాలీ

అబిడ్స్: ఎజైకిల్ సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆహ్లాదం, ఆరోగ్య ప్రయోజనాలను పెంపొందించేందుకు సైకిల్ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్యం, సుస్థిరత, మనిషి సంతోషంగా ఉండేందుకు సైకిలింగ్ ఎంతో ప్రయోజనం అని అవగాహన కల్పించారు. మిస్టర్ వరల్డ్ సిల్వర్ మెడలిస్ట్ మీర్ మోతేషామ్, ఎజైకిల్ సీఈఓ శ్రీనివాసులు ఈ కార్యక్రమంలో పాల్గొని సైకిల్ ర్యాలీ చేపట్టారు. సైకిల్ వల్ల ప్రయోజనాలను వివరించారు.

బీజేపీ నేతల సంబరాలు



సంబరాల్లో పాల్గొన్న రాష్ట్ర బీజేపీ కో ఆర్డినేటర్ గోపాల్‌జీ


గోల్కొండ: బీజేపీకి తిరుగులేదన్న విషయం మరోసారి రుజువైందని బీజేపీ రాష్ట్ర నాయకుడు దేవర శ్రీనివాస్ అన్నారు. మంగళవారం బీజేపీ దేశంతో పాటు రాష్ట్రంలో కూడా అత్యధిక స్థానాలు కైవసం చేసుకున్న సందర్భంగా గుడిమల్కాపూర్‌లో ఆయన ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు విజయ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో బీజేపీ బలీయమైన శక్తిగా ఎదిగిందన్న విషయం తమ పార్టీ ఎనిమిది స్థానాలు గెలుచుకోవడం స్పష్టం చేస్తుందన్నారు. ఈ సంబరాల్లో కార్పొరేటర్ దర్శన్, నాయకులు నామా యాదగిరినేత, అర్చన్‌కాంతా, మురళీకృష్ణగౌడ్, ప్రభు పూజారి, గంజి రఘునాథ్, ఆర్.వెంకటేష్‌సాగర్ తదితరులున్నారు.

మోదీతోనే దేశాభివృద్ధి..


అబిడ్స్: ప్రధానమంత్రి నరేంద్రమోదీతోనే దేశం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందని బీజేపీ రాష్ట్ర కార్యాలయ కో ఆర్డినేటర్ డి.గోపాల్‌జీ పేర్కొన్నారు. గత పదేళ్లపాటు మోదీ ప్రభుత్వం చేపట్టిన ప్రగతి, సంక్షేమం, అభివృద్ధితోనే ప్రజలు మరోసారి ఎన్‌డీఏను గెలిపించారన్నారు. మంగళవారం దేశవ్యాప్తంగా ఎన్‌డీఏ మెజార్టీ సీట్లు సాధించడంతో గోపాల్‌జీ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం వద్ద మిఠాయిలు తినిపించి సంబరాలు చేశారు. ఈ సందర్భంగా గోపాల్‌జీ మాట్లాడుతూ..మరోసారి భారత్ ప్రపంచ వ్యాప్తంగా భారత్ అగ్రగామిగా మారేందుకు మోదీ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ వేడుకల్లో దాసరి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చార్మినార్‌లో..

చార్మినార్: దేశంలో బీజేపీ ఘన విజయం సాధించడంతో చార్మినార్‌లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం సాయంత్రం సంబరాలు జరుపుకొన్నారు. బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచిపెట్టారు. రంగులు చల్లుకుంటూ ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. భాజా భజంత్రీల నడుమ డ్యాన్స్‌లు చేశారు. ముచ్చటగా మూడోసారి దేశ ప్రధాని నరేంద్ర మోదీ బాధ్యతలు చేపడుతున్న సందర్భంగా కొంత మంది ఆలయాల్లో పూజలు నిర్వహించారు.



దేవర శ్రీనివాస్‌కు మిఠాయిలు తినిపిస్తున్న బీజేపీ నాయకులు



సంబరాల్లో బీజేపీ ఓబీసీ మోర్చా ఐటీ సెల్ రాష్ట్ర కన్వీనర్ ప్యారసాని వెంకటేష్

కిషన్‌రెడ్డి గెలుపుతోనే సికింద్రాబాద్ అభివృద్ధి



పవన్‌కుమార్

అబిడ్స్: సికింద్రబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి జి.కిషన్‌రెడ్డి గెలుపుతోనే సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని నాంపల్లి అసెంబ్లీ నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ కొల్లూరి పవన్‌కుమార్ పేర్కొన్నారు. అన్నివర్గాల ప్రజలు ఆదరించి కిషన్‌రెడ్డిని గెలిపించడం ఎంతో అభినందనీయమన్నారు. మంగళవారం తన కార్యాలయం వద్ద కిషన్‌రెడ్డి గెలిచిన వెంటనే టపాకాయలు పేల్చి మిఠాయిలు పంచి పెట్టారు. అనంతరం కొల్లూరి పవన్‌కుమార్ మాట్లాడుతూ..కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ మరోసారి ప్రధాని కానుండడంతో దేశం ప్రపంచంలోనే అగ్రగామిగా ఉంటుందన్నారు. సికింద్రాబాద్‌తో పాటు తెలంగాణ రాష్ట్రం, దేశ నలుమూలలా ఎన్‌డీఏను గెలిపించిన ప్రజలకు కొల్లూరి పవన్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రపంచంలోనే ఇండియా నెంబర్:1 స్థానానికి ఎదుగుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

ఈ చేతి పంపులు..అలంకార ప్రాయమే

- శిథిలావస్థకు చేరినా స్పందించని జలమండలి
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- మరమ్మతు చేయాలని స్థానికుల డిమాండ్

చార్మినార్: అధికారుల నిర్లక్ష్యం కారణంగా చేతిపంపులు శిథిలావస్థకు చేరుకున్నాయి. శాలిబండ, బేలా కాలనీ, రాంబక్షి బండ తదితర కాలనీల్లోని చేతి పంపులే ఇందుకు నిలువెత్తు సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. ఇవి కాకుండా పాతబస్తీలోనూ ఇలాంటి పరిస్థితులే కనిపిస్తున్న పరిస్థితులు..దీంతో నగరంలోని పలు ప్రాంతాల్లో ఈ తరహాలోనే చేతిపంపులు శిథిలావస్థకు చేరుకుని అలంకారప్రాయంగా మారయని స్థానికులు వాపోతున్నారు. దీనిపై చర్యలు తీసుకోవాల్సిన సంబంధిత జలమండలి అధికారులు నిద్రావస్థలో ఉన్నారని, ఏళ్ల తరబడి ఇటువైపు కన్నెత్తైనా చూడడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేమని ప్రశ్నిస్తే..భూగర్భ జలాలు అడుగంటాయని కుంటిసాకులు చెబుతున్నారని చెబుతున్నారు. వాస్తవానికి అధికార యంత్రాంగం మరమ్మతులను విస్మరించారని, ఇప్పటికైనా నిర్లక్ష్యం వీడి పాతబస్తీలోని బోరింగ్‌లకు వెంటనే మరమ్మతు చేయించాలని స్థానికులు కోరుతున్నారు. రానున్న పండుగల సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని కుళాయిల్లో నీరు సరఫరా అయ్యేలా చూడాలని డిమాండ్ చేస్తున్నారు.

ఖర్మకాండలకూ అవస్థలే...

కుళాయిల ద్వారా సరఫరా అయ్యే అరకొర నీటితో అవస్థలు పడుతున్నామని పాతబస్తీలోని యాకుత్‌పురా, చార్మినార్, చాంద్రాయణగుట్ట, బహదూర్‌పురా తదితర నియోజకవర్గాల్లోని స్థానికులు వాపోతున్నారు. గతంలో ఏర్పాటు చేసిన బోర్ల మరమ్మతు పనులను పూర్తిగా మరిచిపోవడమే ఈ పరిస్థితికి కారణమని, చావులు, ఖర్మకాండలు, దిన కర్మలు తదితర కార్యక్రమాల సమయంలో గతంలో బోరింగ్‌లపై ఆధారపడేవారమని, ప్రస్తుతం ఆ పరిస్థితి లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక పండుగలు, ఉత్సవాల సమయంలో సమస్య మరింత తీవ్రంగా ఉంటుందని వాపోతున్నారు.

లెక్కలు తెలియని జలమండలి..!

ఇప్పటికే బస్తీలో ఏర్పాటు చేసిన బోర్‌లలో ఎన్ని పని చేస్తున్నాయి..? ఎన్ని శిథిలావస్థకు చేరుకున్నాయి..? మరమ్మతులు చేయిస్తే..ఎన్ని బోరింగ్‌లు అందుబాటులోకి వస్తాయి..? అనే సమాచారం సంబంధిత జలమండలి అధికారులు, సిబ్బంది వద్ద ఉందో లేదో తెలియని పరిస్థితి. కాగా కొంత మంది జలమండలి మేనేజర్లు తమ వద్ద సరైనా సమాచారం అందుబాటులో లేదనే విషయాన్ని వారే ఒప్పుకుంటున్న పరిస్థితి. దీంతో అధికారుల నిర్లక్ష్యంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వేసవి నీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా వెంటనే పవర్ బోర్లు, చేతి పంపులు, వాటర్ ట్యాంకులను బాగు చేయించాలని పాతబస్తీ ప్రజలు కోరుతున్నారు.



శాలిబండలో నిరుపయోగంగా చేతి పంపు



బేలా కాలనీలో..



రాంబక్షిబండలో..

మరమ్మతులు చేయించాలి...



పాతబస్తీలో శిథిలావస్థకు చేరిన చేతిపంపులతో పాటు, కొత్తవాటిని ఏర్పాటు చేసి నీటి కొరతను నివారించాలి. నీటి సమస్యపై ఫిర్యాదు చేసినా స్పందించని అధికారులపై చర్యలు తీసుకోవాలి. రానున్న సీజన్‌లో అవసరాలను దృష్టిలో ఉంచుకుని చేతిపంపులకు మరమ్మతు చేయాలి.

- ప్యారసాని వెంకటేష్, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఐటీ సెల్ కన్వీనర్